

# సంసారంలో సరిగమలు

## – తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### రాధ - రుక్మిణి

**"ఓయ్ మల్లెదండా"**

"ఊఁ"

"ఓ జాజిమొగ్గా"

"అబ్బ ఏమిటి?"

"నిద్రరావడంలేదు ఏవైనా కబుర్లు చెప్పు" ఆమె బుగ్గమీద చేత్తో రాసాడు. రాధ గలగలా నవ్వి లేచి కూర్చుంది.

"నా చిన్నప్పుడు సినిమాల్లో సత్యనారాయణ, జానకి, లేదా గొల్లపూడి, అన్నపూర్ణల మధ్య శృంగార దృశ్యాలు ఉండేవి. 'ఈ ముసలాళ్ళ సరసాలు చూళ్ళేం బాబూ' అని మేమంతా నవ్వుకునేవాళ్ళం" చెప్పింది.

"అంటే? నేను ముసలివాడినా?" కోపం నటించాడు గిరిధారి.

"లేదు లేదు. నీకింకా అరవై రాలేదుగా, అరవై దాటితే వృద్ధాప్యం." మళ్ళీ నవ్వింది రాధ.

"రాధా చిన్నప్పుడు నువ్వు మన ఊరి గుళ్ళో ఓ పాట పాడేదానివి. అది పాడవా?" ఆమె ఒళ్ళో తలపెట్టుకుని అడిగాడు.

"జాబిల్లి వస్తున్నాడే వెన్నెల్లు తెస్తున్నాడే." అతనికి మెల్లిగా చిచ్చుకొడుతూ రాధ సన్నటి గొంతుతో పాడుతూంటే మొదటి చరణం పూర్తయ్యేలోపలే అతను నిద్రపోయాడు.

మర్నాడు గిరి నిద్రలేచేసరికి తొమ్మిది దాటింది. రాధ ఆఫీస్‌కి వెళ్ళిపోయింది. శని ఆదివారాలు గిరికి సెలవు. ముఖం కడుక్కుని వంటగదిలోకి వెళ్ళాడు. రాధ కాఫీ కలిపి గిన్నెలో పోసి స్టవ్ మీద ఉంచింది. దాని మూత తీసి స్టవ్ వెలిగించి వేడెక్కిన కాఫీని కప్పులో పోసుకుని ముందుగదిలోకి వచ్చి పేపర్ అందుకున్నాడు. ఫ్లాస్క్‌లో పోసిన కాఫీ అతనికి నచ్చదు. కాఫీ తాగాక ఆకలేసింది. టేబుల్ మీదున్న హాట్ పేక్స్ మీద మూత తీసి చూసాడు. ఓ దాంట్లో, పూరీ, బంగాళదుంపల కూర ఉన్నాయి. గిరికి ఉప్మా, ఇడ్లీలాంటివి

నచ్చవు. పెసరట్టు, పూరీలాంటివి కావాలి బ్రేక్‌ఫాస్ట్‌గా. టేబుల్ మీదే పెట్టి ఉన్న ప్లేట్‌లో వాటిని సర్వ్ చేసుకుని టీ.వి చూస్తూ తిన్నాడు. ఇంతలో లండన్ నుంచి కూతురు ఫోన్ చేసింది.

"నాన్నా స్కైప్‌లో రా."

లేప్‌టాప్ ఆన్ చేసి వాళ్ళతో ఓ గంటసేపు మాట్లాడాడు. తర్వాత మళ్ళీ బద్ధకంగా పడుకుని రెండింటికి లేచి స్నానం చేసి అన్నం తిన్నాడు. అన్ని కూరలూ నచ్చవు గిరికి. చాలా నిషేధాలు, పరిమితులు ఉన్నాయి. రాధ చాలా జాగ్రత్తగా అతనికి కోపం రాకుండా వంట చేస్తుంది.

సాయంత్రం ఆరు దాటుతూండగా వచ్చింది రాధ.

"ఎలా గడిచింది రోజు?" అలసటగా నవ్వుతూ అడిగింది.

జవాబుగా నవ్వాడు. అతని నుదుటిమీద మృదువుగా చుంబించింది రాధ.

"రాధా!" పక్కనే పడుకున్న ఆమెని మృదువుగా పిలిచాడు.

"ఏమిటి మల్లెచెండు రాధయింది?" కొంటెగా నవ్వుతూ అడిగింది.

"నేను రేపు వెళ్ళిపోతున్నాను."

"ఏమిటి?" దిగ్గున లేచి కూర్చుంది.

"అవును. రుక్మిణి రేపు సాయంత్రం వస్తోంది. పొద్దున స్కైప్‌లో మాట్లాడాను."

రాధ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అప్పుడే ఆర్నెల్లయిందా?" గొణుగుతున్నట్లుగా చెప్పింది.

"అవును. నాక్కూడా అలాగే అనిపిస్తోంది" చెప్పాడు గిరి.

"ఈ ఆర్నెల్లూ గృహిణి పాత్రని ఎలా పోషించాను?" పేలవంగా నవ్వుతూ అడిగింది.

"అద్భుతంగా. ఐనా రాధా.. నువ్వు పెళ్ళి చేసుకుని ఉండాల్సింది." సానుభూతిగా చెప్పాడు.

"ఏమో గిరీ. నువ్వు రుక్మిణిని పెళ్ళి చేసుకున్నాక పెళ్ళి మీదకి మనసుపోలేదు. పెద్దవాళ్ళుంటే మందలించి చేసేవాళ్ళేమో. నీకు తెలుసుగా నేను మామయ్య దగ్గర పెరిగానని వాళ్ళు పట్టించుకోలేదు. అదృష్టమో దురదృష్టమో గవర్నమెంట్ జాబ్ వచ్చింది. ఇలా వంటరిగా బతకడం అలవాటైంది. మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావు?"

ఇబ్బందిగా కదిలాడు గిరిధారి.

"చవకగా వచ్చిందని ఇంతదూరంలో ఇల్లుకొన్నావు. ఇది తూర్పులో ఉంటే, మా ఇల్లు పడమరలో ఉంటుంది. వర్కింగ్ డేస్‌లో రాలేను. వీకెండ్స్ బయటకి తీసుకెళ్ళకపోతే రుక్మిణి ఊరుకోదు."

"మా ఆఫీస్ ఇక్కడికి దగ్గరని కొనుక్కున్నాను. అంతే కానీ చవకని కాదు. హు! మీ అమ్మాయి మళ్ళీ ప్రెగ్నెంటై, రుక్మిణి డెలివరీకి వెళ్తేకానీ కుదరదన్నమాట."

"అవును. సారీ"

"పర్లేదు. అప్పుడప్పుడూ రుక్మిణి పుట్టింటికి, పెళ్ళిళ్ళకి వెళ్తూంటుందిగా." రాధ భారంగా చెప్పింది.

"అవును. అప్పుడు నీ దగ్గరకే వస్తూంటాగా. ఇక పడుకుందాం. రేపు పొద్దున్నే లేవాలి నేను." ఆవులిస్తూ చెప్పాడు గిరిధారి.

"ఆర్నెల్లు ఇల్లాలు లేకపోయినా ఇంటిని అద్దంలా ఉంచారే?" మెచ్చుకోలుగా చెప్పింది రుక్మిణి.

"పనిమనిషి కూడా లేకుండా" నవ్వాడు గిరిధారి.

"మీకు ఏవీ ఓ పట్టాన నచ్చవు. భోజనానికి ఎంత ఇబ్బంది పడ్డారో అని చాలా బాధ పడ్డాను. కానీ అమ్మాయికి అవసరం తప్పలేదు." నొచ్చుకుంది రుక్మిణి.

"లండన్ నీళ్ళు పడ్డాయోయ్ నీకు. ఐదేళ్ళు చిన్నదానివైనట్లు ఉన్నావు" గుసగుసలాడుతూ చెప్పాడు.

మనవరాలున్న రుక్మిణి కొత్త పెళ్ళికూతురిలా సిగ్గుపడింది.

చాలా రోజుల తర్వాత భార్య చేతి వంటని తృప్తిగా తిన్నాడు భోజన ప్రియుడైన గిరిధారి. పడకమీద పరిచితమైన స్పర్శకూడా వినూత్నంగా అనిపించింది.

"రుక్కూ" ప్రేమగా పిలిచాడు.

"ఊఁ" ఆమె స్నిగ్ధంగా పలికింది.

"నువ్వు లండన్‌కి వెళ్ళేముందు ఏదో నెక్లెస్ కొనుక్కుంటానన్నావు కదూ?"

"అవును. అన్‌కట్ డైమండ్ నెక్లెస్."

"రేపెళ్ళి కొనుక్కో.."

"నిజంగా?" సంభ్రమంగా అడిగింది.

అవును. ఈ ఆర్నెల్లూ నా జీతం పెద్దగా ఖర్చుకాలేదు."

"మావారు శ్రీవారు... మా మంచి వారూ" రాగం తీసింది రుక్మిణి.

ఆమెని గాఢంగా కౌగలించుకుంటూ అనుకున్నాడు గిరిధారి "ఈ భోజన సౌఖ్యం, ఈ పడక సుఖం కోసం ఎంత దూరం వెళ్ళాల్సి వచ్చింది! ఎంత భావుకతని నటించాల్సి వచ్చింది!"

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story